# మమత

శివర్ధని

పెళ్ళి వయస్సు దాటిపోయిందని. ఆఫీసులో అందరికీ కాంతిమీద నిరసనభావం రకరకాలుగా వుండేది. సాయంత్రం అందరూ ఆఫీసులోంచి బైటకు వస్తున్నారు.

"ఎలాగైతేనేం మీ చెల్లెలి పెళ్ళి చేసేసేరు. బాధ్యతలు బాగానే నిర్వర్తిస్తున్నారు వర్వాలేదే." అన్నాడు హెడ్ క్లార్కు వైకుంఠం.

"ఏదో అయిందిలెండి. పెళ్ళి పనుల్లో శేఖర్ గారు ఎంతో సహాయపడ్డారు. ఆయనకు కృతజ్ఞతలు ఎలా చెప్పాలో తెలియడంలేదు." కాంతి వైకుంఠం మాటల్లో వ్యంగ్యం గ్రహించింది. అయినా కృతజ్ఞత నిండిన కళ్ళతో శేఖర్ ముఖంలోకి చూస్తూ అంది.

"మరీ అంతలా పొగడకండి. తోటి సహోద్యోగిగా ఆ మాత్రం సహాయపడ్డం కూడా గొప్పేనా?" సెక్షన్ హెడ్ శేఖర్ అభిమానపూర్వకంగా అన్నాడు.

"కట్నం ఎంత? ఏ మాత్రం ఖర్చుఅయింది?" అన్నాడు కాషియర్ ఆనంద్.

అనవసర ప్రసంగం చేస్తున్నారనుకున్నాడు శేఖర్ మనస్సులోనే కాంతివేపు జాలిగా చూస్తూ.

"ఏమోనండి అదంతా నాన్నగారు చూసుకున్నారు" అంటూనే కాంతి తొందరగా ముందుకి దూసుకుపోయింది. కాని వెనుకనుంచి మాటలు వినిపిస్తూనే వున్నాయి.

"తండ్రి త్రాగుబోతు తిరుగుబోతు. అసలు ఇంటి సంగతే పట్టించుకోడు. కట్నం సంగతి తండ్రి చూసుకున్నాడంటూంది." ఆ గొంతులో నిరసనభావం ధ్వనించింది. అది మంగపతి గొంతు.

"మరి ఈవిడగారి పెళ్ళెప్పుడు?" ఆ మాటల్లో హేళన వినిపించింది. అది మరో గుమాస్తా పశుపతి గొంతు.

"ఆ ఇంట్లో ఈవిడగారి సంగతి పట్టించుకున్న దెవరు? అయినా ఈవిడ కన్యాకుమారి అని పేరు పెట్టుకోవలసింది." వెకిలి నవ్వులు వినిపించేయి.

ఈ వెధవ ఉద్యోగం మానేస్తే బాగుండేది. అత్యవసర పరిస్థితుల్లో కాని, ఏ ఆడపిల్లా ఉద్యోగం చెయ్యదని, ఏదో కారణంవల్ల కాని, వివాహం కాకుండా వుండిపోదని, ఈ సమాజం ఎప్పటికి గుర్తిస్తుందో? అనుకుంది కాంతి.

"మీకు వీలైనప్పుడు మా ఇంటికి రండి. అతి ముఖ్యవిషయం మాట్లాడాలి" మర్నాడు ఆఫీసులో శేఖర్ అతని ఇంటి ఎడ్రస్ చెప్పేడు.



గత మూడు సంవత్సరాల్లోనూ, శేఖర్ ఇంత దొరవగా వాళ్ళ ఇంటికి రమ్మనలేదు. వెళ్ళకపోతే బాగుండదు. అతను రేఖ పెళ్ళికి ఎన్ని పనుల్లు చేసిపెట్టేడు? ఏన్ని రేఖతో మూడు నిద్రలకు వెళ్ళడం కూడా మంచికే వచ్చింది. ఇంటికెళ్ళడం అరగంట ఆలస్యమైతే లేనిపోని అర్థాలు తీస్తుంది. ఈరోజే వెళ్ళాలి అనుకుంది కాంతి.

కాంతిని చూసి, శేఖర్ లోపలికి ఆహ్వానించేడు. అంతలోనే, "చూడు నాన్నా! పక్కవాళ్ళ కమల 'నీకు అమ్మలేదు' అంటూంది" అని ఏడుస్తూ రబ్బరు బొమ్మలా వున్న ఐదేళ్ళ పాప లోపలికి వచ్చింది. కాంతిని చూసి మీటనొక్కినట్లు టక్కున ఏడుపు ఆపేసింది. "అమ్మ వచ్చిందా?" కుతూహలంగా అడుగుతూ తండ్రివళ్ళోకెక్కి కూర్చుంది.

"ఆమెకి నమస్తే చెప్పు." శేఖర్ పాప కళ్ళు తుడుస్తూనే అన్నాడు. చిట్టి చిట్టి చేతులు జోడించి "నమస్తే అమ్మా" అంది పాప. శేఖర్ పాపని పక్క కుర్చీలో కూర్చోబెట్టి లోపలికి వెళ్ళేడు.

పాప అమ్మ వచ్చిందా అంటోంది. శేఖర్‌కి భార్యలేదా? లేక విడిచిపెట్టి వెళ్ళిపోయిందా? ఇంత మంచిమనిషిని, అందమైన పాపని విడిచి పెట్టి వెళ్ళడానికి, ఆమెకి మనస్సు ఎలా ఒప్పిందో? అనుకుంటూనే శాంతి పాప వేపు చూసింది. పాప పెద్ద పెద్ద చక్రాల్లాంటి కళ్ళతో ఆమె వేపే చూస్తూంది. చిరునవ్వుతో దగ్గరకు రమ్మని పిల్చింది. ఒళ్ళో కూర్చోబెట్టుకుని ముంగురులు సవరిస్తూ,

"నీపేరేంటి?" అంది.

"ప్రశాంతి" అంది పాప.

"మరి మీ అమ్మ ఎక్కడికి వెళ్ళింది?"

"నాన్నని అడుగుతే దేవుడి దగ్గరకు వెళ్ళింది వచ్చేసరికి బోల్డు రోజులు పడుతుంది అన్నారు. నిన్ను దేవుడు పంపించేశాడా? నువ్వేనా మా అమ్మవి?" అమాయకంగా అడిగింది.

"పాప మిమ్మల్ని ప్రశ్నలతో వేధిస్తూందా?" అంటూ వచ్చేడు శేఖర్.

"లేదులేండి."

పనిపిల్ల రెండు కప్పులతో కాఫీ తెచ్చింది. "నువ్వెళ్ళి ఆడుకో పాపా" అంటూ శేఖర్ పనిపిల్లనీ పాపనీ పంపేశాడు. కాఫీ త్రాగడం పూర్తయింది.

"మీతో ప్రత్యేకంగా మాట్లాడాలని రమ్మన్నాను. అపార్థం చేసుకోకండి. మా పాప పుట్టిన సంవత్సరంలోనే నా భార్య పోయింది. మా బంధువులు కొందరు వాళ్ళ పిల్లల్ని చేసుకోమని ఒత్తిడి చేశారు. నా భార్య మమతల మానసం చవిచూసిన నాకు, అప్పట్లో పునర్వివాహపుటాలోచనే కలుగ లేదు. బంధువుల ఒత్తిడికి తట్టుకోలేక ఈ ఊరు బదిలీ చేయించుకున్నాను. పాపే నా సర్వస్వం అయింది. అక్కడ, స్కూల్లో పిల్లలు నీకు అమ్మలేదు అనగానే, బిక్కముఖం వేసుకుని వస్తూంది. మనకెందుకు అమ్మలేదు? ఎక్కడికి వెళ్ళింది? అమ్మని తీసుకురాకపోతే నేను అన్నం తిననంటూ, మారాం చేస్తూంది. పాపకి అమ్మని తీసుకురాకపోతే అది నాకు దక్కదేమో? అని భయంగా వుంది. పాపని స్వంత బిడ్డగా చూసుకునే స్త్రీని నేను వివాహం చేసుకోవాలి. ఏ మాత్రం తప్పటడుగు వేసినా మా ఇద్దరి జీవితాలు నరకమైపోతాయి. మీ పరిస్థితులన్నీ నాకు తెలుసు. ఆఫీసులో మిమ్మల్ని ఎంత చులకన చేస్తున్నారో గ్రహించేను. ఈ మూడు సంవత్సరాల్లో మిమ్మల్ని వ్యక్తిగతంగా పరిశీలించేను. పేరుకి తగ్గట్టుగా మీ సహనశీలత, మీ మృదుహృదయం నన్నెంతగానో ఆకర్షించేయి. మీ నీడలో పాప, నేను సుఖపడతామన్న నమ్మకం కుదిరింది. మీకు అభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని వివాహం చేసుకుంటాను. బాగా ఆలోచించుకుని చెప్పండి" అన్నాడు శేఖర్.

శేఖర్ మాటలు పదేపదే మననం చేసుకుంటూ, శాంతి ఇల్లు చేరుకుంది. సవితితల్లీ, తండ్రీ పెద్దగా ఘర్షణ పడుతున్నారు.

"పిన్నీ ఊరినుంచి ఎప్పుడు వచ్చేవు? అసలేం జరిగింది?" అంది.

"ఏం జరిగిందా? నా పిల్ల వాళ్ళ ఇంట్లో కాపురం చెయ్యాలా వద్దా? రేణుకి మంచి సంబంధం కుదిరిందని కదూ నీ ఈర్ష్య? మీ నాన్న వ్యసనపరుడని, ఇంటి బాధ్యతలు నువ్వే మోస్తున్నావని, అందుకే నీకు పెళ్ళికాకుండా చెడగొడుతున్నానని, ఇంకా ఏవేవో వియ్యాల వారు నన్ను అడిగేరు. ఈ లేనిపోని కబుర్లు ఎవరే వాళ్ళకి అందించేరు. నువ్వేనా? నీ సంపాదన తింటున్నామనేగా ఇలా చేశావు? ఏ పెళ్ళికొడుకైనా నీ ముఖంచూస్తే ఆమడదూరం పరిగెడతాడు. నిన్నెవడు చేసుకుంటాడు తల్లీ!" అంటూ శాపనార్థాలు పెట్టింది.

శాంతి గదిలో మంచంమీద వాలిపోయింది. ఎంత చేసినా పిన్ని నోటంట ఒక్క సానుభూతి వాక్యం రాదు. పైగా నామీద నిందలు వేస్తూంది. సవతికూతుర్ననా? అలా అనుకుందికి వీల్లేదు. శేఖర్‌ని వివాహం చేసుకుంటే ప్రశాంతికి మారుటి తల్లినికానా? ఆ పాపని బాధ పెట్టగలదా తను? ఈ తేడా ఎక్కడ వుంది? స్త్రీ హృదయంలో వుందా? మమత మానవత వున్న స్త్రీకి అందరూ సమానమే. పిన్ని చాలా స్వార్థపరురాలు. ఆమె పిల్లలు బాగుండాలి. తనేమైపోయినా బాధలేదు. కన్న తండ్రికి ఎవరూ అక్కరలేదు. ఆయన వ్యసనాలకు డబ్బుండాలి. ఈ ఇంట్లో ఎంత నికృష్ట జీవితం గడుపుతున్నది. ఈ పంజరం ఊచలు ఛేదించుకుని ఎగిరిపోవాలి. కాని ఎలా? శాంతికి ఎప్పుడూ లేనంత దుఃఖం ముంచుకు వచ్చింది. శేఖర్‌ని వివాహం చేసుకుని, ఈ ఇంట్లోంచి వెళ్ళిపోవాలి. అప్పుడు కాని పిన్నికి తన విలువ తెలీదు. బాధ్యతలు తలమీద మోస్తే నాన్నకి కూడా బుద్ధిరావచ్చు. పిన్నికి, నాన్నకి ఇది అగ్ని పరీక్షే అవుతుంది. హేళనలు భరిస్తూ ఉద్యోగం కూడా చెయ్యలేకపోతున్నది. రేపే వెళ్ళి, ఈ వివాహానికి ఇష్టపడుతున్నానని, ఉద్యోగానికి రాజీనామా చేస్తానని, శేఖర్‌తో చెప్పాలి, అప్పుడు అతని ఆంతర్యం కూడా బైటపడుతుంది. తనని కోరుకుంటున్నాడో? తన డబ్బు కోరుకుంటున్నాడో? తెలుసుకోవచ్చు. అన్న నిశ్చయానికి వచ్చింది.

రెండు రోజులు గడిచేయి. శేఖర్ ఆఫీసుకి రాలేదు. శాంతి అతని ఇంటికి వెళ్ళింది. ఆవరణలో ఆడుకుంటున్న పాప "అమ్మా!" అంటూ కాళ్ళకు పెనవేసుకుంది. ఆ స్పర్శలో శాంతి ఏదో చెప్పలేని మధురానుభూతి పొందింది. అమ్మ అన్న పిలుపులోనే వుందేమో ఆ మాధుర్యం. అమ్మ అనే మాట ఉచ్చరించే అదృష్టానికి తను నోచుకోలేదు. శేఖర్ భార్యని అనుకోడం కన్న, పాపకి తల్లిని అనుకుంటేనే మనస్సు స్పందిస్తూంది అనుకుంది. ఆ మధురానుభూతితోనే పాపని గుండెకి అదుముకుంది. తెచ్చిన యాపిల్‌పండు పాపకిచ్చింది. బుగ్గలమీద ముద్దులవర్షం కురిపించింది.

"మరి నాన్నగారు ఇంట్లో వున్నారా?" అడిగింది శాంతి.

"ఓ!" ప్రశాంతి తండ్రిగది చూపించింది. శేఖర్ కళ్ళుమూసుకుని మంచంమీద పడుకున్నాడు.

"నాన్నా! అమ్మ వచ్చింది. మళ్ళీ ఎక్కడికి వెళ్ళవద్దని చెప్పండి."

ఈ హడావిడికి శేఖర్ కళ్ళు విప్పేడు. పాపని ఎత్తుకుని నించున్న శాంతి కనిపించింది. కళ్ళనిండుగా చూసేడు.

"దేవుడు నాకు అమ్మని పంపించేడని, ఇటుపై మా దగ్గరే వుండిపోతుందని, విమలకి కమలకి చెప్తాను నాన్నా!" అంటూ శాంతి చేతుల్లోంచి పాప క్రిందికి జారిపోయి వీధిలోకి పరిగెత్తింది.

"మీ గురించే ఆలోచిస్తున్నాను." అంటూ శేఖర్ కుర్చీచూపించేడు.

"ఆఫీసుకి రాలేదేం?"

"కొద్దిగా జ్వరం వచ్చింది. రెండు రోజులు

సెలవు పెట్టేను." అంటూనే శేఖర్ ఆమె ముఖ కవళికలు పరీక్షిస్తున్నాడు.

"మిమ్మల్ని వివాహం చేసుకుని, పాపకి తల్లినవాలనే నిశ్చయించుకున్నాను. కాని ఉద్యోగానికి రాజీనామా చెయ్యాలనుకుంటున్నాను. మీరేమంటారు?"

"తప్పకుండా చెయ్యండి. ఈ వివాహానికి అంగీకరిస్తే, ఆ విషయం నేనే చెప్పాలనుకున్నాను పాపకి తల్లిగా, నాకు భార్యగా వుండి మీ మమతల పందిరిలో మాకింత నీడనిస్తే చాలు. మానసికంగా శారీరకంగా విశ్రాంతి తీసుకోండి. నాకు డబ్బు చాలానే వుంది. ఉద్యోగం చెయ్యవలసిన అవసరం లేదు." అంటూ శేఖర్ దిగ్గున మంచందిగి, ఆమె రెండు చేతులూ ధైర్యంగా అందుకున్నాడు.

*

"ఆఫీసు ఐదుగంటలతో సరికదా? ఇంత పొద్దుపోయేవరకు ఎక్కడ ఊరేగుతున్నావు తల్లీ. నీనుంచి నేను అపనిందలు పడవలసి వస్తూంది." రాత్రి ఎనిమిదింటికి ఇల్లు చేరుకున్న శాంతిని నిలదీసి అడిగింది సవతితల్లి.

ఆమె వేపు నిరసనగా చూసి, గదిలోకి వెళ్ళిపోయింది శాంతి.

"తలబిరుసు కాకపోతే సమాధానం చెప్పకుండా వెళ్ళిపోతావా? మీ నాన్న రానీ తేలుస్తాను." అంటూ అరిచిందామె.

'ఇంకెన్నాళ్ళులే, కొద్దిరోజులు ఓపికపడితే, ఈ ఇంట్లోంచి వెళ్ళిపోవచ్చు. ఆఫీసులో అందరికీ బుద్ధి వచ్చేలా రేపే నా రాజీనామా ఇచ్చేస్తాను.' అనుకుంది శాంతి.


"మీ పెద్దకూతురు ఊళ్ళో ఊరేగి ఇప్పుడే వచ్చింది. ఇలా విచ్చలవిడిగా తిరిగితే నలుగురూ ఏమనుకుంటారు? ఇదే నా కన్న కూతురైతే నరికి పోగులు పెట్టేదాన్ని. ఇంత ఆలస్యమైందేమంటే, నిర్లక్ష్యంగా చూసి వెళ్ళిపోయింది. రేణు పెళ్ళయింది మొదలు శాంతిలో చాలా మార్పు వచ్చింది. అది ఇల్లు దాటిపోయిందంటే, మనం అడుక్కుతినాలి. ముందు దాని సంగతి కనుక్కోండి." అంటూ రభస చేసింది కనకదుర్గ భర్త ఇంటికి రాగానే.

"తర్వాత చూద్దాం. ముందు అన్నం వడ్డించు. పేకాట మధ్యలో ఆపేసి వచ్చాను." అంటూ కనకయ్య భార్యని త్వరపెట్ట సాగేడు.

అర్ధరాత్రి వీధి తలుపు చప్పుడైంది. ఇంట్లో అందరికీ మెలకువ వచ్చింది. తలుపు తెరవగానే నలుగురు మనుష్యులు కనకయ్యని మోసుకొచ్చి పడుక్కోబెట్టేరు.

"ఏమైందంటూ" కనకదుర్గ భర్తమీద వాలిపోయింది.

"పేకాట మధ్యలో గుండె చేత్తో పట్టుకుని పక్కకి వొరిగిపోయేడు. వెంటనే డాక్టర్‌ని పిలుచుకు వచ్చాం. అప్పటికే ప్రాణం పోయింది" అన్నారు.



## వేదన

సుతిమెత్తన మహిళా హృదయం
ఆవేదనల రోదనకే అంకితమా?
లలనామణి అపురూప లావణ్యం
పురుషాధిక్యతకే సమర్పితమా?
వనిత నేర్చిన విజ్ఞానమంతా
పాకశాస్త్ర పరిజ్ఞానానికే పరిమితమా?
మహిళ మానసిక ఎదుగుదల
వారసత్వపు బానిస భావాభివృద్ధికా?
పెంపొందిన స్త్రీ ఆలోచనా సరళి
ఆత్మవంచనల ఆచరణ సాధనకా?
క్షణం క్షణం అతివ జీవితం
రక్షణ కోసమే నిరీక్షణమా?
అసలు ఆడదిగా పుట్టడమే నేరమా?!

—నిర్మలాదేవి

కనకదుర్గ శోకాలు మొదలు పెట్టింది. శాంతి ఆ దృశ్యం చూసింది. అంతే తండ్రి మృత దేహం దగ్గర చలనరహితంగా నిలబడిపోయింది. ఆమె హృదయాంతరాళంలో మెదులుతున్న ఆలోచనలు భగవంతుడికే తెలియాలి.

మర్నాడు శేఖర్ వచ్చి పలకరించేడు. శాంతి అతని కళ్ళలోకి చూడబోయింది. కన్నీటి పొర అడ్డుగోడగా నిల్చింది. అతను వెళ్ళబోతూంటే, చిన్న చీటీ అందించింది. రోడ్డుమీద ఆ చీటీ విప్పేడు. ఒకే ఒక్క వాక్యం ముత్యాల సరంలా గోచరించింది.

బాధ్యతల వలయంలోంచి తప్పించుకోలేని నిర్భాగ్యురాలు.

—శాంతి

శేఖర్ తలమీద పిడుగుపడ్డది. ఆ పసిదాన్ని ఎలా మరిపించాలో తెలీదు. శాంతి ప్రశాంతి కలసి తన హృదయ ఫలకంమీద శాంతి కురిపిస్తారని ఆశించేడు. ఆ ఆశలు విహంగమై పరుగులెత్తేయి. కానీ రెక్కలు తెగిన పక్షిలా క్రింద పడ్డాడు. శేఖర్ నిరాశగా నవ్వుకున్నాడు.

మరొక్కమారు ఆ చీటీలో వాక్యం చదువుకున్నాడు. దస్తూరీని బట్టి మనిషి వ్యక్తిత్వం నిర్ణయించవచ్చు. బాధ్యతల నిర్వహణలో, మనిషి స్వర్గానుభూతి పొందవచ్చు. ఆమె వ్యక్తిత్వమే ఆమెకి శ్రీరామరక్ష కావాలి. శేఖర్ మనస్సులోనే శాంతిని ఆశీర్వదించాడు. కానీ శాంతి పరిస్థితి.... తండ్రి మరణానికి తనే కారణమైనట్లు శాపనార్థాలు పెడుతున్న పిన్ని....తనవల్లే ఆయన మానసిక వేదన అనుభవించి పోయినట్లు ఆవిడ కల్పన.... అది బంధువులు నమ్మడమూ .... వారి దెప్పిపొడుపుల మధ్య కర్మకాండలు పూర్తయ్యేయి. శాంతి యథాప్రకారం ఆఫీసుకి వెళ్ళింది.

శేఖర్ సీటులో కొత్త గుమస్తా కనిపించేడు. షాక్ తిన్నది శాంతి....తను కాదన్నందుకు శేఖర్ రాజీనామా ఇచ్చి వెళ్ళిపోయాడా? అటు పిన్నికి తోడుగా వుండబోయి ఆప్యాయతానురాగాలు అందివ్వబోయిన శేఖర్‌ని దూరం చేసుకున్నది. కానీ తనకి దక్కిందేమిటి....పిన్నినుంచి ఎప్పటి నిరాదరణ–ఏహ్యతా నేగా....

ఐదు నిముషాలు అక్కడే నిలబడిపోయింది. ఏమాలోచించుకుందో ఒక్క ఉదుటున శేఖర్ ఇంటికి ఆటోలో వెళ్ళింది. తలుపు తాళం పెట్టి వుంది. పక్కవాటా వాళ్ళని అడిగింది. అప్పుడే స్టేషన్‌కి వెళ్ళారని చెప్పేరు. ఆ ఆటోలోనే స్టేషన్‌కి వెళ్ళింది. మద్రాస్ మెయిల్ కదలడానికి సిద్ధంగా వుంది. శాంతి ప్రతీ పెట్టె గాలిస్తూంది. "అమ్మా!" అన్న పిలుపు వినిపించింది. అంతే శాంతి ఆ పెట్టెలోకి ఎక్కడం, రైలు కదలడం యాంత్రికంగా జరిగిపోయాయి! □